బలగం TV
BALAGAM
నిజమే మా బలం.. ప్రజలే మా బలగం
BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com
హైదరాబాద్ మంగళవారం 28 జనవరి 2025 www.balagamtv.com పేజీలు 4

## ఇంటర్ విద్యార్థినీ ఆత్మహత్య

బలగం టీవీ, హైదరాబాద్

ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న ఘటన రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూరి మండలం అంబగిరి గ్రామానికి చెందిన ఉడతనూరి సౌమ్య(17) పెద్ద అంబర్‌పేట మున్సిపాలిటీ కుంట్లూర్ పరిధిలో ఉన్న తెలంగాణ గిరిజన సంక్షేమ రెసిడెన్షియల్ కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం (బైపీసీ)చదువుతున్నది. వసతి గృహంలో ఆదివారం రాత్రి అందరూ భోజనానికి వెళ్లగా ఆమె తరగతి గదిలోకి వెళ్లి ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఆ తర్వాత తోటి విద్యార్థినులు గమనించి సిబ్బందికి చెప్పగా వెంటనే బాలికను వనస్థలిపురం ఏరియా ఆస్పత్రికి తరలించారు. కానీ, అప్పటికే ఆమె చనిపోయినట్టు వైద్యులు నిర్ధారించారు. ఆమె గతంలో కూడా ఆత్యహత్యాయత్నం చేయగా.. హాస్టల్ నుంచి ప్రిన్సిపాల్ పంపించేశారు. తల్లిదండ్రులు బతిమలాడటంతో మళ్లీ హాస్టల్‌లో చేర్చుకున్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఇన్‌స్పెక్టర్ నాగరాజు తెలిపారు.

తన కూతురిని కులం పేరుతో టీచర్ వేధించడంతోనే ఆత్మహత్య చేసుకుందని మృతురాలి తండ్రి శివశంకర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. క్లాస్ టీచర్ వేధించడంతో పాటు అందరిలో కాకుండా వేరుగా గదిలో కూర్చోబెట్టేదని తన కూతురు ఫోన్ చేసి చెప్పేదని ఆవేదన వ్యక్తం చేశారు.

# జమిలిపై చర్చ ప్రజాస్వామ్యానికి కీలకం



- ఈ చర్చను యువత ప్రోత్సహించాలి
- నిరంతరం ఎన్నికల వల్ల పాలన, అభివృద్ధికి విఘాతం
- ప్రధాని నరేంద్ర మోడీ

బలగం టీవీ, న్యూఢిల్లీ బ్యూరో

"ఒక దేశం, ఒకే ఎన్నికలు" ప్రతిపాదనపై చర్చను ప్రధానమంత్రి నరేంద్ర మోడీ స్వాగతించారు. ఇది దేశ ప్రజాస్వామ్య ప్రక్రియకు కీలకమని అన్నారు. 'ఒకే దేశం, ఒకే ఎన్నికలు' అనే అంశంపై చర్చలో పాల్గొనాలని మరియు మరిన్ని చర్చలను ప్రోత్సహించాలని, ఇది వారి భవిష్యత్తుతో నేరుగా ముడిపడి ఉందని ఆయన యువకులను కోరారు. సోమవారం ఢిల్లీలో నేషనల్ కేడెట్ కార్ప్స్ (ఎన్‌సీసీ) ర్యాలీని ఉద్దేశించి ప్రసంగిస్తూ మోడీ ఈ వ్యాఖ్యలు చేశారు.

పోల్స్ తరచుగా భారతదేశంలో నిరంతర ఎన్నికల ప్రచారానికి దారితీస్తున్నాయని అన్నారు."స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత రాష్ట్ర, కేంద్ర స్థాయిలో ఎన్నికలు చాలా కాలం పాటు జరిగాయి. కానీ కాలక్రమేణా, ఈ నమూనా విచ్ఛిన్నమైంది, ఇది దేశానికి గణనీయమైన సవాళ్లను కలిగిస్తుంది, "అని ప్రధాని మోదీ అన్నారు. తరచూ ఎన్నికలు జరగడం వల్ల దేశంలో పాలన, అభివృద్ధికి విఘాతం కలుగుతుందని ప్రధాని మోదీ ఉద్ఘాటించారు.జమిలి ఎన్నికల ప్రతిపాదనపై చర్చను ప్రోత్సహించడం సహా, దానిలో పాల్గొనాలని ఎన్‌సీసీ కేడెట్లు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లకు ఆయన సూచించారు. ఇది నేరుగా వారి భవిష్యత్తులతో ముడిపడిన అంశమని మోదీ చెప్పారు.

ఈ రోజు, 'ఒక దేశం, ఒకే ఎన్నికలు' గురించి ముఖ్యమైన చర్చ జరుగుతోంది. లోక్‌సభ మరియు రాష్ట్రాల ఎన్నికలను ఒకేసారి నిర్వహించడం వల్ల అంతరాయాలను తగ్గించవచ్చు మరియు మరింత కేంద్రీకృతమైన పాలనా విధానాన్ని ప్రారంభించవచ్చు, "అని ఆయన అన్నారు. దేశ భవిష్యత్తుకు దాని ఔచిత్యాన్ని నొక్కి చెబుతూ, చర్చలో పాల్గొనాలని యువకులను ప్రధాని కోరారు. యువత కూడా రాజకీయాల్లోకి రావాలని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. లక్ష మంది యువకులు రాజకీయాల్లోకి రావాలని ఎర్రకోట నుంచి చెప్పాను అని ఆయన అన్నారు.

"మీరు ఎక్కడ ఉన్నా, ఈ చర్చను ముందుకు తీసుకెళ్లండి అని దేశవ్యాప్తంగా ఉన్న ఎన్‌సీసీ క్యాడెట్‌లు, వాలంటీర్లు మరియు యువకులందరికీ నేను విజ్ఞప్తి చేస్తున్నాను. ఇది నేరుగా మీ భవిష్యత్తుతో ముడిపడి ఉంది, "అని అన్నారు. భారతదేశంలో తరచుగా జరిగే ఎన్నికలను ఇతర దేశాలతో పోల్చడం. అమెరికా వంటి దేశాల్లో ప్రతి నాలుగేళ్లకోసారి ఎన్నికలు జరుగుతాయని, కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు తేదీలు నిర్ణయించుకున్నారని ప్రధాని మోదీ అన్నారు. భారతదేశ యువత సహకారం లేకుండా ప్రపంచ భవిష్యత్తు అసంపూర్ణమని ప్రధాని మోదీ ఉద్ఘాటించారు. "అందుకే నేను మిమ్మల్ని ప్రపంచ ప్రయోజనాల కోసం శక్తిగా పిలుస్తాను," అని చెప్పారు. 2014 నాటికి భారత్‌లో 14 లక్షల మంది ఎన్‌సీసీ కేడెట్లు ఉండేవారు. ఇప్పుడు ఆ సంఖ్య 20 లక్షలకు చేరింది. ఇందులో దాదాపు 8 లక్షల మంది బాలికలే" అని ప్రధాని అన్నారు.

# మోడీ సర్కారుకు వ్యాపారులే ముఖ్యం





- కాంగ్రెస్ పార్టీ పేదల పక్షాన నిలుస్తుంది
- స్వాతంత్రోద్యమాన్ని అవమానించేలా మోహన్ భగవత్ వ్యాఖ్యలు
- కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ
- రాజ్యాంగం మార్చడమే బీజేపీ అజెండా
- సీఎం రేవంత్‌రెడ్డి
- మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో జై బాపు-జై భీం-జై రాజ్యాంగం సభ

బలగం టీవి, ఇండోర్

మోడీ సర్కారుకు వ్యాపారులే ముఖ్యమని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ అన్నారు. మధ్యప్రదేశ్‌లోని మౌహ పట్టణం, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేద్కర్ జన్మస్థలంలో కాంగ్రెస్ పార్టీ నేడు నిర్వహించిన జై బాపు–జై భీం–జై రాజ్యాంగం సభలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ పేదల పక్షాన నిలుస్తుందని, వారికి అండగా ఉంటుందని అన్నారు. తాము అధికారంలో ఉన్న తెలంగాణలో కులగణన సర్వేను విజయవంతంగా పూర్తి చేశామని చెప్పారు. రిజర్వేషన్లలో ఓబీసీలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. పేదలకు, ఓబీసీలకు న్యాయం జరిగేలా పోరాడుతామని అన్నారు. మోదీ సర్కారుకు వ్యాపారులే ముఖ్యమని విమర్శించారు. బీజేపీ రాజ్యాంగ వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని అన్నారు. స్వాతంత్రోద్యమాన్ని అవమానపర్చేలా ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ వ్యాఖ్యలు చేశారని గుర్తు చేశారు. అమిత్ షా సాక్షాత్తూ పార్లమెంటులోనే అంబేద్కర్ ను అవమాన పర్చారని అన్నారు. దేశంలో 90% మందికి చట్టసభల్లో ప్రాతినిధ్యం దక్కడం లేదని, జనాభా దామాషా పద్ధతిలో రిజర్వేషన్లు అమలు చేయాలన్నదే తమ ప్రధాన డిమాండ్ అని రాహుల్ గాంధీ చెప్పారు. రిజర్వేషన్లలో ముఖ్యంగా ఓబీసీలకు అన్యాయం జరుగుతోందని అన్నారు. మోదీ ప్రభుత్వం దేశంలోని విద్యా వ్యవస్థలను భ్రష్టు పట్టించిందని ఆరోపించారు. జీఎస్టీ పేరుతో ప్రజలను లూటీ చేస్తోందన్నారు. కేంద్రంలో బీజేపీ అనుసరిస్తున్న రాజ్యాంగ వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా తాము పోరాడుతున్నామని చెప్పారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. రాజ్యాంగం మార్చడమే బీజేపీ అజెండా అని అన్నారు. రాజ్యాంగాన్ని మార్చాలనే బీజేపీ దాగిన అజెండా దేశానికి మంచిది కాదని చెప్పారు. యూని వర్శిటీ గ్రాంట్స్ కమిషన్ డ్రాఫ్ట్ నిబంధనలను రాజ్యాం గంపై దాడిగా అభివర్ణించారు. ఈ నిబంధనలను వెంటనే ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. రాజ్యాంగ పరిరక్షణకు తామంతా రాహుల్ గాంధీ వెన్నంటి పోరాడుతున్నామనిఅన్నారు. ఇది ఎన్నికల ర్యాలీ కాదని, ఒక యుద్ధమని చెప్పారు. రాజ్యాంగ పరిరక్షణ కోసం ఈ పోరాటం చేస్తున్నామని చెప్పారు.

కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే మాట్లాడుతూ మతం పేరిట నిరుపేద వర్గాలను దుర్వినియోగం చేయడాన్ని కాంగ్రెస్ ఎన్నటికీ సహించబోదని చెప్పారు. మహా కుంభమేళాలో బిజెపి నేతలు పవిత్ర స్నానాలు చేయడాన్ని ఖర్గే అపహాస్యం చేస్తూ, పవిత్ర గంగా నదిలో స్నానం చేయడం వల్ల పేదరికం తొలగిపోదని అన్నారు, అయితే, ఏ ఒక్కరి 'విశ్వాసాన్ని' నొప్పించడం తన ఆకాంక్ష కాదని ఆయన స్పష్టం చేశారు. బిజెపి నేతలు కెమెరాల కోసమే గంగా నదిలో స్నానం కోసం పరస్పరం పోటీ పడుతున్నారని ఆయన విమర్శించారు. రాజ్యాంగ పరిరక్షణకు సంఘటితం కావాలని కాంగ్రెస్ కార్యకర్తలను పిలుపునిచ్చారు. అలా కానిచో దళితులు, బిసిలు, ఆదివాసీలు, నిరుపేదలు ఇక్కట్లు ఎదుర్కొంటారని ఖర్గే అన్నారు.

## వక్ఫ్ సవరణ బిల్లుకు జేపీసీ ఆమోదం..



- ప్రతిపక్షాల సవరణలకు 'నో'

బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో

వక్ఫ్ బోర్డ్ అధికారాలకు కోత పెడుతూ మోదీ సర్కార్ తీసుకొచ్చిన 'వక్ఫ్ సవరణ బిల్లు'కు ఆమోదం లభించింది. ఈ బిల్లు పరిశీలన కోసం ఏర్పాటు చేసిన పార్లమెంటరీ సంయుక్త కమిటీ సోమవారం సమావేశమైన పలు ప్రతిపాదనలతో బిల్లుకు ఆమోదం తెలిపింది. అధికార బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే సభ్యులు ప్రతిపాదించిన మొత్తం 14 సవరణలను జేపీసీ ఆమోదించింది. విపక్షాలు సూచించిన మార్పులు తిరస్కరణకు గురయ్యాయి. కాగా, వక్ఫ్ సవరణ బిల్లుకు పరిశీలన కోసం ఏర్పాటు చేసిన ప్యానెల్‌కు బీజేపీ ఎంపీ జగదాంబి పాల్ చైర్మన్‌గా వ్యవహరిస్తున్న విషయం తెలిసిందే. ఆయన సమక్షంలో జేపీసీ కమిటీ ఇవాళ సమావేశమైంది. విపక్ష ఎంపీలు సహా ఇతరులు మొత్తంగా 44 మార్పులు సూచించగా.. 14 సవరణలను కమిటీ ఆమోదించినట్లు ప్యానెల్ చైర్మన్ జగదాంబిక పాల్ వెల్లడించారు. ఈ సవరణలు చట్టాన్ని మరింత శక్తివంతంగా మారుస్తాయన్న ఆశాభావం వ్యక్తం చేశారు. కాగా, ఈ 14 ప్రతిపాదనల ఆమోదానికి సంబంధించి జనవరి 29న ఓటింగ్ జరగనుంది. జనవరి 31న తుది నివేదిక లోక్‌సభకు అందజేయనున్నట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి.

కాగా, ఈనెల 24న జరిగిన వక్ఫ్ ప్యానల్ సమావేశం రసాభాసగా సాగిన విషయం తెలిసిందే. జేపీసీ చైర్మన్ జగదంబికా పాల్ ప్రొసీడింగ్స్ ద్వారా తమపై ఒత్తిడి తీసుకువస్తూ ఇష్టారీతిగా అజెండాను మార్చేస్తున్నారని ఆరోపిస్తూ ప్రతిపక్ష సభ్యులు నిరసన తెలియజేయడంతో సమావేశానికి హాజరైన 10 మంది ప్రతిపక్ష సభ్యులను ఒకరోజు పాటు సస్పెండ్ చేస్తున్నట్టు చైర్మన్ ప్రకటించారు. ప్రొసీడింగ్స్‌ని ఓ ప్రహసనంగా మార్చేసిన చైర్మన్ జగదంబికా పాల్ ప్రభుత్వ ఆదేశాల మేరకు వ్యవహరిస్తున్నారని ప్రతిపక్ష సభ్యులు జేపీసీ సమావేశంలో ఆరోపించారు. ఈ ఆరోపణలను ఖండించిన చైర్మన్ సమావేశాన్ని అడ్డుకోవడానికే సభ్యులు ఈ విధంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.

## జీవో నెంబర్ 46పై నెల రోజుల్లో వైఖరి తెలపండి

- రాష్ట్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు ఆదేశాలు

బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో

తెలంగాణ రాష్ట్ర పోలీస్ రిక్రూట్మెంట్ బోర్డు చేపట్టిన స్పెషల్ పోలీస్ నియామకాల్లో జీవో నెంబర్ 46పై నెల రోజుల్లో వైఖరి తెలపాలని రాష్ట్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది. స్పెషల్ పోలీస్ నియామకాల్లో హైదరాబాద్, సైబరాబాద్ అభ్యర్థులకు కటాఫ్ మార్క్ తగ్గిస్తూ గత సర్కారు 2023లో జీవో నెంబర్ 46ను తీసుకొచ్చింది. ఈ జీవోతో గ్రామీణ ప్రాంత యువతకు తీవ్ర అన్యాయం జరుగుతోందనీ, దీనిని మినహాయించాలని కోరుతూ అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించగా నిరాశే ఎదురైంది. ఈ తీర్పును సవాల్ చేస్తు అక్టోబర్ 19 మాటూరి శ్రీకాంత్, బీఆర్ఎస్ నేత రాకేశ్ రెడ్డితో పాటు మరో 74 మంది సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్ సోమవారం జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ముందు విచారణకు వచ్చింది. పిటిషనర్ల తరపు అడ్వొకేట్లు ఆదిత్య సోంది, మిథిన్ శశాంక్ వాదనలు వినిపిస్తూ... సుప్రీంకోర్టు ఆదేశించినా రాష్ట్ర ప్రభుత్వం నేటికీ అఫిడవిట్ దాఖలు చేయలేదని బెంచ్‌కు నివేదించారు. ఇందుకు ప్రభుత్వ తరపు న్యాయవాది స్పందిస్తూ.. అఫిడవిట్ దాఖలుకు మరో రెండు నెలలు గడవు ఇవ్వాలని అభ్యర్థించారు. ఇరువైపుల వాదనలు విన్న ధర్మాసనం ఫిబ్రవరి 28 లోపు జీవో నెంబర్ 46పై అఫిడవిట్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. తదుపరి విచారణను వాయిదా వేస్తున్నట్టు వెల్లడించింది.

# డొనాల్డ్ ట్రంప్‌కు ప్రధాని మోడీ ఫోన్ కాల్



బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు భారత ప్రధాని మోదీ ఫోన్‌లో శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు మోదీ ఎక్స్ వేదికగా పోస్ట్ చేశారు. 'నా ప్రియమైన మిత్రుడు డొనాల్డ్ ట్రంప్‌తో మాట్లాడడం నాకు చాలా ఆనందంగా ఉంది. రెండోసారి అధ్యక్షునిగా బాధ్యతలు చేపట్టినందుకు అభినందనలు తెలిపా. మేము పరస్పర ప్రయోజనకరమైన, విశ్వసనీయ భాగస్వామ్యానికి కట్టుబడి ఉన్నాము. మన ప్రజల సంక్షేమం కోసం, ప్రపంచ శాంతి, శ్రేయస్సు భద్రత కోసం కలిసి పని చేస్తాము' అని పేర్కొన్నారు. డొనాల్డ్ ట్రంప్ అమెరికా బాధ్యతలు చేపట్టిన మరుక్షణం అమెరికన్లకు పెద్ద పీట వేస్తూ పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఇందులో భాగంగా హెచ్1 బీ వీసా, అక్రమ వలసదారులపై ఉక్కుపాదం మోపుతూ పలు ఆర్డర్‌లు జారీ చేశారు. ట్రంప్ ప్రమాణ స్వీకారం చేశాక జన్మతః పౌరసత్వం లభించే హక్కును రద్దు చేస్తూ సంబంధిత పత్రాలపై సంతకాలు చేశారు. అమెరికాలో నివసిస్తున్న భారతీయులపై ఇది ప్రభావం చూపుతుంది. ఈ పరిణామాల నేపథ్యంలో ఇరుదేశాధినేతలు మాట్లాడుకోవడం ప్రాధాన్యతను సంతరించుకుంది.

## పెట్టుబడులు ఎప్పుడు వస్తాయో చెప్పాలి



- బీఆర్ఎస్ ప్రభుత్వం కంటే ఎక్కువ చేసి చూపెడితే సన్మానం చేస్తా
- రేవంత్ రెడ్డికి బుద్ధి ప్రసాదించాలని 30న గాంధీ విగ్రహాలకు వినతి పత్రాలు ఇద్దాం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

రేవంత్ రెడ్డి పెట్టుబడులు తెస్తే అందరికంటే ఎక్కువగా సంతోషపడతామని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. రూ. 1.78 లక్షల కోట్లు అని చెప్పున్నారు కానీ.. 2024లో ఇలానే రూ. 42 వేల కోట్ల పెట్టుబడులని చెప్పారు ఇప్పటివరకు ఏ కంపెనీ రాలేదని గుర్తుచేశారు. ప్రజలు అనుమాన పడుతున్నారని అన్నారు. రేవంత్ రెడ్డి చేతనైతే పెట్టుబడులు ఎప్పుడు వస్తాయో చెప్పాలని డిమాండ్ చేసారు. బీఆర్ఎస్ ప్రభుత్వం కంటే ఎక్కువ చేసి చూపెడితే సన్మానం చేస్తానని కేటీఆర్ పేర్కొన్నారు.తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్వీ క్యాలెండర్ ను ఆయన ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ, ఆహా నా పెళ్లంట సినిమాలో కోట శ్రీనివాస్ రావు క్యారెక్టర్ పిసినారిగా ఉంటుంది. చికెన్ పెడుతా అని ఇంటికి కొందరిని పిలుస్తాడు. ఇక ప్లేట్‌లో అన్నం, చట్నీ వేసి.. ముందట కోడిని వేలాడదీస్తాడు.. ఇదే చికెన్ అని ఊరిస్తాడు. ఇవాళ రేవంత్ రెడ్డి ప్రభుత్వ తీరు అలాగే ఉంది. ఆరునూరైనా సరే.. వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేసి తీరుతాం, చేసి చూపెడుతా అని గంభీరమైన డైలాగులు కొట్టారు. ఇది చేస్తాం.. అది చేస్తాం.. పొడిచెస్తాం అని 420 హామీలిచ్చి అధికారంలోకి వచ్చారు. ఇవాళ 14వ నెల నడుస్తుంది. ఇప్పుడు కూడా సిగ్గు లేకుండా అబద్ధాలు చెబుతున్నారన్నారు.

రాష్ట్రంలో కొత్త రేషన్ కార్డులు ఇవ్వడం చారిత్రాత్మకమని ప్రభుత్వం చెప్పుకోవడం సిగ్గుచేటని అన్నారు. బీఆర్ఎస్ హయాంలో రేషన్ కార్డులు ఇవ్వలేదని చెప్పడం హాస్యాస్పదంగా ఉందని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా మీసేవలో దరఖాస్తు చేసుకున్న వారికి 6.5 లక్షల కొత్త రేషన్ కార్డులను ఇచ్చామని గుర్తు చేశారు. తమ ప్రభుత్వం హయాంలో తెలంగాణను దేశానికి దిక్సూచిలా తీర్చిదిద్దామన్నారు. ఇప్పటి వరకు హామీలు అమలు చేయలేదని, ఇందుకు నిరసనగా జనవరి 30న గాంధీ విగ్రహానికి వినతి పత్రాలు ఇస్తామన్నారు. డూప్లికేట్ గాంధీలకు బుద్ధి వచ్చేలా చేయాలని ఆ మహాత్ముడిని కోరుతామన్నారు.

రాష్ట్రంలోని గురుకుల విద్యార్థులు ప్రపంచ స్థాయిలో పోటీ పడుతున్నారంటే.. ఆ ఘనత మాజీ సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని కేటీఆర్ అన్నారు. పదేళ్లలో కేసీఆర్ నాయకత్వంలో అటు సంక్షేమం, ఇటు అభివృద్ధి రెండు సమాంతరంగా ముందుకు పోయిందన్నారు. పరిశ్రమలు, పర్యావరణం, ఐటీ, వ్యవసాయ రంగంలో దేశానికి దిక్సూచిగా నిలిచామని చెప్పారు. విద్యా రంగంలో కేసీఆర్ ఎన్నో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారని గుర్తు చేశారు. వెయ్యికి పైగా గురుకులాలను స్థాపించారని, కేసీఆర్ నాయకత్వంలో బహుశా దేశంలో ఏ రాష్ట్రంలో జరగలేదంటే అది అతిశయోక్తి కానే కాదు అని కేటీఆర్ తెలిపారు. రాష్ట్రంలో వెయ్యికి పైగా గురుకుల విద్యాసంస్థలు ఏర్పాటు చేశామని కేటీఆర్ అన్నారు. మెడికల్ కాలేజీలే కాకుండా నర్సింగ్ కాలేజీలను ఏర్పాటు చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. విద్యారంగంలో ఎన్నో విప్లవాత్మకమైన ఆలోచనలు చేశారని, అటవీ, హార్టికల్చర్, వెటర్నరీ, మహిళా యూనివర్సిటీలు స్థాపించామన్నారు. ఆ యూనివర్సిటీలకు తెలంగాణ ప్రముఖుల పేర్లు పెట్టి గౌరవించుకున్నామని కేటీఆర్ పేర్కొన్నారు. రాష్ట్రంలో 26 వేల పైచిలుకు ప్రభుత్వ పాఠశాలలు ఉంటే వాటిని మూడు దశల్లో అభివృద్ధి చేయాలని నిర్ణయించామని చెప్పారు.

ఏడాదిలో 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని రాహుల్ చెప్పారు. ఏడాది పూర్తయినా తర్వాత కూడా 12 వేల ఉద్యోగాలు దాటలేదు. మనం వేసిన నోటిఫికేషన్లకు ఉద్యోగాలు ఇచ్చి తామే ఇచ్చినట్టు ఫోజులు కొట్టుకుంటున్నారు. అందుకే ఈ విషయాలను సోషల్ మీడియా, కాలేజీ, స్కూల్ సభల్లో విద్యార్థులకు అర్థమయ్యే విధంగా చెప్పాల్సిన బాధ్యత మనపై ఉంది. 95 శాతం ఉద్యోగాలు స్థానికులకు ఉన్న అవకాశం కేవలం తెలంగాణ రాష్ట్రంలోనే ఉంది. ఇతర రాష్ట్రాలకు ఈ వెసులుబాటు లేదు. ఓపెన్ కేటగిరిలో కూడా మనం కొట్లాడొచ్చు. రాష్ట్రపతిని ఒప్పించి, మెప్పించి కేసీఆర్ రిజర్వేషన్లు తీసుకొచ్చారని గుర్తు చేశారు.

# ఆర్టీసీలో సమ్మె సైరన్

- 21 డిమాండ్లతో ఆర్టీసీ యాజమాన్యానికి సమ్మె నోటీసు
- డిమాండ్లు నెరవేర్చకుంటే సమ్మెకు వెళతామని హెచ్చరిక



బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్‌ఆర్టీసీ)లో సమ్మె సైరన్ మోగింది. సోమవారం ఆరు కార్మిక సంఘాల జేఏసీ నేతలు యాజమాన్యానికి సమ్మె నోటీసు ఇచ్చారు. 15 రోజుల్లో సమ్మె తేదీ ప్రకటిస్తామని చెప్పారు. సమ్మె నోటీసు ఇచ్చిన అనంతరం జేఏసీ చైర్మెన్ ఈ వెంకన్న (ఎంప్లాయీస్ యూనియన్), వైస్ చైర్మెన్ ఎమ్ థామస్‌రెడ్డి (టీఎమ్‌యూ), కన్వీనర్ మహ్మద్ మౌలానా (ఎన్ఎమ్‌యూ), కో కన్వీనర్లు కే యాదయ్య (బీకేయూ), ఎస్ సురేష్ (బీడబ్ల్యూయూ), బీ యాదగిరి (కార్మిక పరిషత్) బస్‌భవన్ వద్ద మీడియాతో మాట్లాడారు. యాజమాన్యం, ప్రభుత్వంతో చర్చలకు తామెప్పుడూ సిద్ధంగా ఉంటామన్నారు. ఆర్టీసీ కార్మికుల సమ్మెను నివారించాల్సిన బాధ్యత వారిదేనని స్పష్టంచేశారు. ఆర్టీసీలో సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలు పరిష్కరించాలనీ, సంస్థలోకి విద్యుత్ అద్దె బస్సుల ప్రవేశాన్ని అనుమతించబోమని తేల్చిచెప్పారు. రాష్ట్ర ప్రభుత్వమే విద్యుత్ బస్సుల్ని కొనుగోలు చేసి, ఆర్టీసీలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనం, 2021 జీతభత్యాల సవరణ, కండక్టర్, డ్రైవర్ల ఉద్యోగ భద్రత, ఖాళీల భర్తీ, ఆర్టీసీ పరిరక్షణ సహా 21 డిమాండ్లతో కూడిన సమ్మె నోటీసును యాజమాన్యానికి ఇచ్చామన్నారు. గత ప్రభుత్వం మాదిరే కాంగ్రెస్ ప్రభుత్వం కూడా వ్యవహరిస్తే, ఆర్టీసీ కార్మికుల ఆగ్రహాన్ని చవిచూడాల్సి ఉంటుందని హెచ్చరించారు. కార్మికులను సమ్మెకు సన్నద్ధం చేయడం కోసం వచ్చే రెండువారాలు రాష్ట్రవ్యాప్తంగా డిపోలు, గ్యారేజీల్లో పర్యటిస్తామని చెప్పారు. భవిష్యత్ కార్యాచరణకు కార్మికులు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు.

## గద్దర్‌కు పద్మ అవార్డు ఎలా ఇస్తాం?

- కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్



బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ సంచలన వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం పంపిన ప్రతీ ఒక్కరికీ కేంద్రం అవార్డులు ఇవ్వదని, అర్హులకే మాత్రమే ఇస్తుందని అన్నారు. గద్దర్‌కు ఎలా ఇస్తాం? ఆయన భావజాలం ఏంటి?. బీజేపీ కార్యకర్తలను, పోలీసులను చంపిన వారికి అవార్డులు ఎలా ఇస్తాం? అని ఆయన ప్రశ్నించారు. ప్రస్తుతం ఈ వ్యాఖ్యలు దుమారం రేపుతున్నాయి.

సోమవారం ఆయన మాట్లాడుతూ పద్మ అవార్డుల జాబితాలో అర్హులకే అవార్డులు వచ్చాయి. రాష్ట్ర ప్రభుత్వం మంచి పేర్లు పంపితే కేంద్రం పరిశీలిస్తుంది. ఏ పేరు పడితే ఆ పేరు పంపితే ఇవ్వరు అని అన్నారు. "పద్మ అవార్డులు స్థాయి ఉన్న వారికి ఇస్తాం. గద్దర్‌కు ఎలా ఇస్తాం? ఆయన భావజాలం ఏంటి?. బీజేపీ కార్యకర్తలను, పోలీసులను చంపిన వారికి అవార్డులు ఎలా ఇస్తాం?. మా కార్యకర్తలను చంపిన వ్యక్తులపై ఆయన పాటలు పాడారు. మరి అలాంటి వ్యక్తికి పద్మ అవార్డు ఎలా ఇస్తాం?. బరాబర్ ఇవ్వం".. అని అన్నారాయన.

తెలంగాణ ప్రభుత్వానికి అభివృద్ధి మీద చిత్తశుద్ధి లేదు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణ అభివృద్ధికి సహకరిస్తుంది. తెలంగాణకు కేంద్రం గత పదకొండేళ్లలో 12 లక్షల కోట్ల రూపాయలు కేటాయించింది. తెలంగాణ ప్రభుత్వం సంక్షేమ పథకాల పేర్లను మార్చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలు ఆపేది లేదు. రాష్ట్ర ప్రభుత్వ ప్రమేయం లేకుండా నేరుగా లబ్ధిదారులకు పథకాలు అందేలా కేంద్ర ప్రభుత్వం ఆలోచన చేస్తుంది.. ప్రయత్నం చేస్తుంది. కేంద్ర ప్రభుత్వం పథకాలకు పేర్లను మార్చి అమలు చేయాలని తెలంగాణ ప్రభుత్వం చూస్తోంది అని అన్నారు.

## నాలుగు పథకాల అమలు ప్రారంభం

- 6,15,677 మంది అర్హులకు లబ్ధి
- రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసాకు ఆర్థిక శాఖ రూ.579 కోట్లు విడుదల

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ ప్రభుత్వం ఒకే రోజు నాలుగు సంక్షేమ పథకాలను విజయవంతంగా ప్రారంభించటంతో పాటు.. అక్కడికక్కడే 6,15,677 మంది అర్హులకు లబ్ధి కల్పించింది. రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసాకు ఆర్థిక శాఖ రూ.579 కోట్లు విడుదల చేసింది. లక్షలాది మంది రైతులు, వ్యవసాయ కూలీల కుటుంబాల్లో ఈ నిధులు జమ కావటంతో రాష్ట్రమంతటా ప్రజల్లో ఆనందం వెల్లివిరిసిందని ప్రభుత్వం సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది. ముందుగా ప్రకటించిన విధంగానే ప్రజాపాలనలో నాలుగు సంక్షేమ పథకాలు విజయవంతంగా ప్రారంభమయ్యాయి. తొలి రోజునే లక్షలాది మంది ఈ సంక్షేమ పథకాలను అందుకున్నారని పేర్కొన్నది. గణతంత్ర దినోత్సవం రోజున రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మండలాల్లో ఎంపిక చేసిన 563 గ్రామాల్లో ఈ పథకాలను ప్రభుత్వం లాంఛనంగా ప్రారంభించింది. ఆయా గ్రామాల్లో ఉన్న రైతులకు రైతు భరోసా, వ్యవసాయ కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ఆర్థిక సాయాన్ని అప్పటికప్పుడే వారి ఖాతాల్లో జమ చేసింది. దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులందరికీ రేషన్ కార్డులు జారీ చేసింది. ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను అందించింది. రేషన్ కార్డులకు దరఖాస్తు చేసుకున్న కుటుంబాలకు కొత్త కార్డులు జారీ చేసింది. మొదటి రోజునే రాష్ట్ర ప్రభుత్వం రూ.569 కోట్ల రైతు భరోసా నిధులు విడుదల చేసింది. మొత్తం 32 జిల్లాల్లో 563 గ్రామాలలో 4,41,911 మంది రైతులకు ఎకరానికి తొలి విడతగా రూ. 6 వేల చొప్పున పెట్టుబడి సాయం అందించింది.

## కేసీఆర్ కప్ బ్రోచర్‌ను ఆవిష్కరించిన కేటీఆర్



**బలగం టీవి, హైదరాబాద్**

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకుని బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న కేసీఆర్ కప్ –2025 బ్రోచర్‌ను మాజీ మంత్రి, బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ సోమవారం ఆవిష్కరించారు. తెలంగాణ భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు తుంగ బాలు, కార్యక్రమ నిర్వాహకుడు కొంపెల్లి నరేశ్, నేతలు బోయపల్లి నాగరాజు, కురువ పల్లయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొంపెల్లి నరేశ్ మాట్లాడుతూ.. ప్రతి ఏటా నిర్వహించిన విధంగానే ఈ ఏడాది సైతం కేసీఆర్ జన్మదినమైన ఫిబ్రవరి 17న కేసీఆర్ కప్ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ క్రికెట్ టోర్నమెంట్‌లో విజేతగా నిలిచిన జట్టుకు రూ.30,000 నగదు బహుమతితో పాటు ట్రోఫీ అందజేస్తామని వివరించారు.

## హైకోర్టుకు ఈటల

**బలగం టీవి, హైదరాబాద్**

బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ హైకోర్టును ఆశ్రయించారు. పోచారం పోలీస్ స్టేషన్‌లో తనపై నమోదైన ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయాలని కోరుతూ ఆయన పిటిషన్ దాఖలు చేశారు. ఇటీవల ఏకశిలానగర్‌లో స్థిరాస్తి వ్యాపారిపై చేయిచేసుకున్నారని ఈటలపై పోలీసులు కేసు నమోదు చేశారు. వాచ్‌మెన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు చర్యలు తీసుకోవడంతో ఈటల హైకోర్టును ఆశ్రయించారు.

## అడిషనల్ ఎస్పీ తిరుపతన్నకు బెయిల్

**బలగం టీవి, హైదరాబాద్**

ఫోన్ ట్యాపింగ్ కేసులో అడిషనల్ ఎస్పీ తిరుపతన్నకు బెయిల్ లభించింది. తెలంగాణలో రాజకీయ నేతలు, హైకోర్టు న్యాయమూర్తులు సహా పలువురి ఫోన్లు ట్యాప్ చేశారంటూ నమోదైన కేసులో సుప్రీంకోర్టు ఆయనకు బెయిల్ మంజూరు చేసింది. ఈ కేసులో అరెస్టయిన తిరుపతన్న 10నెలలుగా జైలులోనే ఉన్నారు. బెయిల్ విషయమై కోర్టును తిరుపతన్న ఆశ్రయించగా విచారణ పలుమార్లు వాయిదా పడుతూ వచ్చింది. తాజాగా కేసును విచారించిన ధర్మాసనం పిటిషినర్ వాదనలతో ఏకీభవించి బెయిల్ ఇచ్చింది. దీంతో ఆయనకు ఊరట లభించినట్లు అయ్యింది. కాగా, బీఆర్ఎస్ హయాంలో రాజకీయ నేతల ఒత్తిడితో అధికారులు చాలా మంది ఫోన్లు ట్యాప్ చేశారని పెద్దఎత్తున ఆరోపణలు వచ్చాయి. 03, డిసెంబర్ 2023న తెలంగాణ ఎన్నికల ఫలితాల్లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాడే ఆధారాలు ధ్వంసం చేశారని కేసులు నమోదు అయ్యాయి. ఈ కేసులో ప్రధాన నిందితుడు అడిషనల్ ఎస్పీ తిరుపతన్ననే అంటూ పోలీసులు కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. దాదాపు పది మాసాలు జైల్లో ఉన్న ఏఎస్పీ సుప్రీంకోర్టు తీర్పుతో విడుదల కానున్నారు.



## సూర్యాపేట జిల్లాలో పరువు హత్య..?

**బలగం టీవి, హైదరాబాద్**

సూర్యాపేట జిల్లా కేంద్రం సమీపంలోని పిల్లలమర్రి గ్రామ రెవిన్యూ శివారులో సోమవారం తెల్లవారుజామున సూర్యాపేట పట్టణానికి చెందిన వడ్లకొండ కృష్ణ (30) హత్యకు గురయ్యారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మామిళ్లగడ్డకు చెందిన వడ్లకొండ కృష్ణ అనే యువకుడు. అదే ప్రాంతానికి చెందిన భార్గవి ప్రేమించుకున్నారు. తమ ప్రేమ విషయాన్ని ఇంట్లో చెప్పగా.. కులాలు వేరు కావటంతో పెళ్లికి భార్గవి సోదరుడు ఒప్పుకోలేదు. దీంతో ఆరు నెలల క్రితం ఇద్దరూ ప్రేమ వివాహం చేసుకున్నారు. చెల్లెలు భార్గవి కులాంతర వివాహం చేసుకోవడం ఆమె అన్నకు ఏమాత్రం ఇష్టం లేదు. ఈ క్రమంలో కృష్ణపై భార్గవి సోదరుడు పగ పెంచుకున్నాడు. ఈ క్రమంలోనే కృష్ణను హత్య చేసినట్లు తెలిసింది.

ప్రేమ వివాహం చేసుకోవడాన్ని అంగీకరించని నేపథ్యంలో కక్ష పెంచుకుని సూర్యాపేట పట్టణంలోని తాళ్లగడ్డకు చెందిన బైరు మహేష్ గౌడ్‌తో పథకం ప్రకారం హత్య చేయించారని భార్గవి ఆరోపిస్తున్నారు. సంఘటన స్థలాన్ని సూర్యాపేట డిఎస్పీ జి.రవి పరిశీలించారు. హత్యకు గల కారణాలను తెలుసుకుని నిందితులను అరెస్టు చేస్తామని చెప్పారు. సూర్యాపేట రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## పట్టణాల్లోకి కూలీలకు 'ఇందిరమ్మ ఆత్మీయ భరోసా' వర్తించాలని హైకోర్టులో పిల్

### 4 వారాల్లో నిర్ణయం తీసుకోవాలని సీఎస్‌కు ధర్మాసనం ఆదేశాలు

**బలగం టీవి, హైదరాబాద్**

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రారంభించిన ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకంపై హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. నారాయణపేట వాసి గవినోళ్ల శ్రీనివాస్.. ఇందిరమ్మ ఆత్మీయ భరోసాపై ప్రజాప్రయోజన వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. భూమి లేని రైతు కూలీలకు ఏటా రూ. 12వేలు చెల్లించేలా రేవంత్ సర్కార్ పథకాన్ని రూపొందించింది. కేవలం గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న కూలీలకు మాత్రమే ఈ పథకాన్ని వర్తింపజేస్తూ ఉత్తర్వులు జారీ చేసిందని పిటిషనర్ కోర్టుకు తెలిపారు. పురపాలకాల్లో ఉన్న రైతు కూలీలకు డబ్బులు ఇవ్వడం లేదని పిటిషనర్ పేర్కొన్నారు. 129 పురపాలకాల్లో 8లక్షల మందికి పైగా రైతు కూలీలు ఉన్నారని చెప్పారు. గ్రామాల్లో ఉన్న వారికి ఇచ్చి పురపాలకాల్లో ఉన్న వాళ్లకు ఇవ్వకపోవడం సరైంది కాదని పిటిషనర్ కోర్టుకు తెలిపారు. రైతు కూలీలు ఎక్కడున్నా అందరూ సమానమేనని పిటిషనర్ తరపు న్యాయవాది వాదించారు. కేవలం గ్రామాల్లోని వారికే వర్తింపజేయడం సుప్రీంకోర్టు తీర్పులకు విరుద్ధమని చెప్పారు.

ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన చీఫ్ జస్టిస్ ధర్మాసనం.. పురపాలకాల్లోని రైతు కూలీలకు ఆత్మీయ భరోసా పథకం వర్తించడంపై నాలుగు వారాల్లో నిర్ణయం తీసుకోవాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. నాలుగు వారాల్లో నిర్ణయం తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి సీజే ధర్మాసనం ఆదేశాలు జారీ చేసింది.

## వేములవాడ సర్కారీ దవాఖానాలో అరుదైన చికిత్స...

**బలగం టీవీ , వేములవాడ**

అరుదైన శస్త్ర చి కిత్సలకు వేములవాడ సర్కారీ దవాఖాన కేంద్రంగా మారింది.రాజన్న సిరిసిల్ల జిల్లా రాళ్ళపేట గ్రామానికి చెందిన 53 సంవత్సరాల మహిళకి రొమ్ములో ఫిల్లోడ్స్ టూమర్ గడ్డని ప్రత్యేక అరుదుగా ఇచ్చే మత్తు ద్వారా వైద్య బృందం తొలగించారు.మామూలుగా నరం ద్వారా మత్తుమందును శరీరం మొత్తం వచ్చేలా చేసి గడ్డని తొలగిస్తారు. అలా కాకుండా వేములవాడ లో ని సర్కారీ దావకాన మత్తు వైద్య బృందం డా. పెరికె తిరుపతి, డా.రవీందర్, డా.రాజశ్రీ,డా.ప్రియాంక,డా. సిద్దార్థ్, ఇతర సహాయక సిబ్బంది కలిసి రీజినల్ తొరసిక్ ఎపిడ్యూరల్ అనే పద్ధతిలో మత్తు మందుని పంపి రోగికి ఆపరేషన్ సమయంలో అలాగే ఆసుపత్రిలో ఉన్నన్ని రోజులు నొప్పి పూర్తిగా తెలవకుండా ఉండే విధంగా చేశారు.ఇట్టి ఆపరేషన్ నీ సీనియర్ సర్జన్ డా.పెంచలయ్య నేతృత్వంలో డా.రాజేంద్ర, డా.జెస్సీ, డా.రత్నకుమారి, ఇతర సహాయక సిబ్బంది ఝాన్సీ, బ్లొసం కలిసి విజయవంతంగా నిర్వహించారు.



## బాధితులకు సత్వర న్యాయం చేయడానికి గ్రీవెన్స్ డే...



● **ఎస్పీ అఖిల్ మహాజన్**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

ప్రజల వద్ద నుండి పిర్యాదులు స్వీకరించి ప్రతి పిర్యాదుపై స్పందించి బాధితులకు సత్వర న్యాయం అందించే విధంగా గ్రీవెన్స్ డే ప్రతి సోమవారం నిర్వహిస్తామని ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు.ఈ సందర్భంగా ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ గ్రీవెన్స్ డే కార్యక్రమనికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి 16 ఫిర్యాదులు స్వీకరించి, ఆయా పోలీస్ స్టేషన్ల అధికారులకు ఫోన్ చేసి బాధితుల సమస్యలను చట్టపరంగా పరిష్కరించాలని ఆదేశించారు. భూ తగాదాలు,ఆస్థి తగాదాల విషయంలో చట్ట ప్రకారం, నిబంధనలకు అనుగుణంగా నడుచుకుంటూ బాధితులకు సత్వర న్యాయం అందించే విధంగా చూడాలనిఅన్నారు .గ్రీవెన్స్ డే ఫిర్యాదులు ఏ మేరకు పరిష్కారం అయ్యాయో ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ ప్రజలకు మరింత సమర్ధవంతంగా సేవలందిస్తున్నామన్నారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ నిర్వహిస్తూనే అసాంఘిక శక్తులు, నేరస్థుల పట్ల కఠిన వైఖరి అవలంభిస్తూ శాంతి భద్రతల సమస్య తలెత్తకుండా చూస్తామని అన్నారు. గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడం ద్వారా సాధ్యమైనంత త్వరగా వాటిని పరిష్కరించేలా చూస్తామని తెలిపారు.

## మహిళ కడుపులోనుంచి భారీ సైజు కణితి తొలగింపు

**బలగం టీవి, హైదరాబాద్**

కామారెడ్డి జిల్లాలో ఓ మహిళ కడుపులో నుంచి ఏడు కిలోల కణితిని ఆపరేషన్ చేసి తొలగించారు. మహ్మద్‌నగర్ మండలం గున్కుల్ గ్రామానికి చెందిన అబేదాబేగం 6 నెలలుగా కడుపునొప్పితో బాధపడుతూ ఎల్లారెడ్డి పట్టణంలోని సూపర్ స్పెషాలిటి ఆసుపత్రి జనవరి 25వ నాడు వైద్యానికి వచ్చింది. ఆమెకు స్కానింగ్ చేసి చూడగా కడుపులో అండాషయ కణతి ఉందని గుర్తించారు. సోమవారం ఉదయం ఆమెకు ఆపరేషన్ చేసి 7.750 కిలోల గర్భసంచి కణితిలను తొలగించడం జరిగింది. ఆపరేషన్ తరువాత పేషెంట్ పరిస్థితి మాములుగా మారినట్లు ఆసుపత్రి డాక్టర్ రవీంద్రమోహన్ తెలిపారు.

## సైఫ్ అలీఖాన్‌పై దాడి కేసులో పశ్చిమ బెంగాల్ మహిళ అరెస్ట్

**బలగం టీవి, ముంబై**

బాలీవుడ్ నటుడు సైఫ్ అలీఖాన్‌పై అతని ఇంట్లో దాడి జరిగిన కేసులో ముంబై పోలీసులు పశ్చిమ బెంగాల్‌కు చెందిన ఓ మహిళను అరెస్ట్ చేశారు. సైఫ్ అలీఖాన్‌పై దాడికి పాల్పడిన నిందితుడు వినియోగించిన సిమ్ కార్డు ఈ మహిళ పేరుతో ఉన్నట్లుగా పోలీసులు గుర్తించారు. నదియా జిల్లా చప్రాకు చెందిన మహిళగా గుర్తించామని పశ్చిమ బెంగాల్ పోలీసులు తెలిపారు. ఈ కేసులోని నిందితుడితో ఈమెకు పరిచయం ఉన్నట్లుగా గుర్తించినట్లు చెప్పారు. బంగ్లాదేశ్ నుంచి భారత్‌లోకి అక్రమంగా ప్రవేశించాడని, అప్పటి నుంచి మహిళతో టచ్‌లో ఉంటున్నాడని చెప్పారు. దర్యాప్తులో భాగంగా ముంబై నుంచి వచ్చిన పోలీసులు ఆమెను అరెస్ట్ చేశారని వెల్లడించారు.

## నలుగురు నిందితులు అరెస్ట్

**బలగం టీవి, సంగారెడ్డి**

వివాహేతర సంబంధానికి భర్త అడ్డు వస్తున్నాడని భావించి అతన్ని ప్రియుడు సహా మరో ముగ్గురితో కలసి భర్తను హత్య చేయించింది భార్య. ఈ మేరకు నలుగురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాల్లోకి వెళ్తే..మూడురోజుల క్రితం తన భర్త అదృశ్యం అయ్యాడని మృతుడి భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. కాగా, సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం పల్పానూర్ గ్రామ శివారులో మృత దేహాన్ని పోలీసులు గుర్తించారు. మృతుడు కామారెడ్డి జిల్లా బిక్కునూర్ మండలం మల్లుపల్లి గ్రామానికి చెందిన మాలే నారాయణ (45) గా గుర్తించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# రహదారి నిర్మాణానికి మోక్షం ఎన్నడో..?



- గ్రామస్తుల పక్షాన సీపీఐ(ఎం) శాఖ డిమాండ్

**బలగం టీవీ , బోయినిపల్లి**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం రత్నంపేట గ్రామానికి వెల్లే ఈ మట్టి రోడ్డు గత నలభై సంవత్సరాల నుండి అభివృద్ధికి నోచుకోకపోవడం పాలకుల నిర్లక్ష్య వైఖరికి నిదర్శనం అని చెప్పుకోవాలని, అలాగే సిగ్గుప డవలసిన అవసరం కూడా ఎంతైనా ఉన్నదని మండల సీపీఐ(ఎం) కన్వీనర్ గురిజాల శ్రీధర్ అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ: భారత గణతంత్ర దినోత్సవ 76 వసంతాలు పూర్తి చేసుకున్న కూడా గ్రామీణ ప్రాంత రోడ్ల అభివృద్ధికి నోచుకోక పోవడం ఈ పాలకుల వైఖరిని ఎలా అర్థం చేసుకోవాలి.ఇప్పటికైనా మారుమూల గ్రామీణ ప్రాంత రోడ్ల మీద దృష్టి పెట్టి, నిధులు మంజూరు చేసి, ఈ మట్టి రహదారిని డాంబర్ రోడ్డుగా మార్చి మండలానికి అనుసంధానం చేయవలసిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు అత్తెన రాజయ్య, గడ్డి శ్రీధర్, రామంచ వంశీ తదితరులు పాల్గొన్నారు.

# పరీక్షల నిర్వహణ పై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ

- ఇంటర్ పరీక్షల నిర్వహణకు తగిన ఏర్పాట్లు చేయాలి-
- మార్చి 5 వ తేదీ నుంచి పరీక్షలు
- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



**బలగం టీవీ , రాజన్న సిరిసిల్ల**

రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షలు నిర్వహించడానికి తగిన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం ఇంటర్ పరీక్షల నిర్వహణ పై జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సంబంధిత అధికారులతో అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్, ఆయా శాఖల అధికారులతో కలిసి కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ ప్రభుత్వం నిర్ధేశించిన షెడ్యూలు ప్రకారం నిర్వహించుటకు కట్టుదిటమైన ఏర్పాట్లు చేయాలని అన్నారు. జనరల్ అలాగే వొకేషనల్ ప్రాక్టికల్ పరీక్షలు వచ్చే నెల 03-02-2025 నుంచి 22-02-2025 వరకు ఉదయం 09.00 గంటల నుంచి మధ్యాహ్నం 12.00 గంటల వరకు, మధ్యాహ్నం 02.00 గంటల నుంచి 05.00 గంటల వరకు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని అన్నారు . ఇంటర్ పరీక్షలు మార్చి 05-03-2025 నుంచి 25-03-2025 వరకు ఉ. 9.00 నుండి మ.12.00 వరకు పరీక్షలు జరుగుతాయని, ఫస్టియర్ విద్యార్థులు 5.065, సెకండ్ ఇయర్ విద్యార్థులు 4,245 మొత్తం 9,310 మంది పరీక్షలకు హాజరుకానున్నారని కలెక్టర్ వెల్లడించారు. పరీక్షల నిర్వహణకు జిల్లాలో మొత్తం 16 కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు అన్నారు .

ప్రభుత్వం పరీక్షల నిర్వహణ పై ప్రత్యేక శ్రద్ధ వహిస్తుందని విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కల్గకుండా పరిక్షలు రాసేలా అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. విద్యార్థులు ఒక గంట ముందుగా పరీక్షా కేంద్రానికి హాజరుకావాలని, ప్రతి పరీక్షా కేంద్రంలో అవసరమైన మౌలిక వసతులు ఏర్పాట్లు చేయాలని, ప్రతి కేంద్రం వద్ద ఏ.ఎన్.ఎం స్థాయిలో వైద్య సిబ్బంది, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ఫస్ట్ ఎయిడ్ కిట్లు అందుబాటులో ఉంచాలని అన్నారు.

జిల్లాలో పరీక్ష ప్రశ్నపత్రాలను నిల్వ జేసెందుకు పోలీస్ స్టేషనలో తగిన ఏర్పాట్లు చేయాలని, ప్రశ్నపత్రాలకు బందోబస్తు కల్పించాలని ఆదేశించారు. పరీక్షా కేంద్రాల వద్ద అవసరమైన సదుపాయాలు కల్పించాలని, పరీక్ష కేంద్రాల వద్ద తప్పనిసరిగా నిరంతర విద్యుత్ సరఫరా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని, సెంటర్లలో మాస్ కాపీయింగ్ మరియు అవాంఛనీయ సంఘటనలు జరగ కుండా తగు చర్యలు తీసుకోవాలని అధికా రులను,పరీక్షలు జరిగే రోజుల్లో ఆర్టీసీ అధికా రులు బస్సులు నడిపించాలని ఆదేశించారు.

పరీక్షలకు విద్యార్థులకు ఒత్తిడి లేకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయలు వారికి ధైర్యం చెప్పాలని అన్నారు. జిల్లాలో పరీక్షలు నిర్వహించే పరీక్షలకు ప్రశ్న పత్రాలను పోలిసు వారి బందోబస్తు వుంచి తీసుకొని వెళ్లాలని, జిల్లాలోని రెవెన్యూ శాఖ పరీక్షా కేంద్రాలకు ఫ్లై యింగ్ స్క్వాడ్ లను ఏర్పాటు చేసి పరీక్ష జరుగు తున్న తీరు పై నిఘా వుంచాలని , 144 సెక్షన్ అమలు చేయాలని, పరీక్షా కేంద్రాల పరిసరాల్లో జిరాక్స్ సెంటర్లు మూసివేయాలని అన్నారు .

పరీక్షా కేంద్రాల వద్ద మంచి నీరు , ఫ్యాన్లు, లైట్లు సరి అయిన విదంగా వుండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని , వెలుతురు వుండేలా చర్యలు తీసుకోవాలని, ప్రతి పరీక్షా కేంద్రంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. పరీక్ష నిర్వహణ అనంతరం సమాధాన పత్రాలను సరిగా సీల్ చేసి పోస్టల్ ద్వారా తరలించే ప్రక్రియ పకడ్బందిగా చేపట్టాలని అన్నారు. పరీక్ష కేంద్రాలకు విద్యార్థులు సరైన సమయంలో చేరుకునే విధంగా బస్సులు నడపాలని ఆర్టీసీ అధికారులను అదనపు కలెక్టర్ సూచించారు. సమావేశంలో జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ అధికారి శ్రీనివాస్, డీఈఓ జగన్ మోహన్ రెడ్డి, డి.ఎం.హెచ్.ఓ డా. రజిత, ఆర్.టి.సి, సెస్, పోస్టల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యతోనే సమాజ పురోభివృద్ధి సాధ్యం..



- కేజీబీవీలో ఐఐటి-జేఈఈ ఫౌండేషన్ కోర్స్ ప్రారంభం..
- ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి

**బలగం టీవీ , సిరిసిల్ల**


విద్యతోనే సమాజ పురోభివృద్ధి సాధ్యపడుతుందని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. సోమవారం ఇల్లంతకుంట మండల కేంద్రంలోగల కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం(కేజీబీవీ)లో కలెక్టర్ సందీప్ కుమార్ ఝాతో కలిసి 8,9,10 వ తరగతి విద్యార్థినులకు ఐఐటీ జేఈఈ ఫౌండేషన్ ఆన్లైన్ కోర్స్ తరగతులను ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ

మాట్లాడుతూ వ్యక్తిగత,సమాజ పురోభివృద్ధికి విద్యమాత్రమే మార్గదర్శిగా నిలుస్తుందన్నారు. విద్యారంగంలో మహిళలకు సాధికారత లేకుంటే దేశం సమగ్ర అభివృద్ధిని సాధించబోదనీ స్పష్టం చేశారు. అందుకే మహిళలు చదువుల్లో రాణించాలన్నారు. విద్యార్థినులకు విద్యతోపాటు జీవన నైపుణ్యాలు, సమస్యల పరిష్కార పద్ధతులు నేర్పించే ఈ ప్రత్యేక తరగతులు విద్యార్థినుల భవిష్యత్తుకు బలమైన పునాది అవుతాయని అన్నారు .

అనంతరం కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ ప్రత్యేక విద్యా కార్యక్రమాలు కేవలం విద్యార్థినుల చదువుని మెరుగుపరచడమే కాకుండా, వారిలో సృజనాత్మకత, నిర్ణయాత్మక శక్తిని పెంచు తాయన్నారు. ఆన్లైన్ ఫౌండేషన్ కోర్సులు విద్యా ర్థులు సద్వినియం చేసుకొని వారు అనుకున్న లక్ష్యాలు చేరుకోవాలని అన్నారు. తల్లిదండ్రుల కలలను సహకారం చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీఈవో జగన్మోహన్ రెడ్డి, జి సి డి ఓ పద్మజ, ఎంపీడీవో, కేజీబీవీ ఎస్ఓ శిరీష, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు

## నియామకం..



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

బీసీ సాధికారత సంఘం రాజన్న సిరిసిల్ల జిల్లా యూత్ అధ్యక్షుడిగా తంగళ్ళపల్లి మండల కేంద్రానికి చెందిన అంకారపు మహేష్ ఏకగ్రీవంగా నియామకమయ్యారు. ఈ సందర్భంగా తనను నియమించిన రాష్ట్ర అధ్యక్షులు కొండా దేవయ్య,ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షులు పొలాస నరేందర్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గాజుల బాలయ్యకు మహేష్ కృతజ్ఞతలు తెలియజేసారు. భవిష్యత్తులో బీసీల హక్కుల సాధనకు కృషి చేస్తానని తెలిపారు

# అర్జీలకు సకాలంలో పరిష్కారం చూపాలి..



- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**బలగం టీవీ , రాజన్న సిరిసిల్ల**

ప్రజావాణిలో వచ్చే అర్జీలకు సకాలంలో పరిష్కారం చూపాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధికారులను ఆదేశించారు.సోమవారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియం లో ప్రజా వాణి నిర్వహించి, ప్రజల నుంచి దరఖాస్తులను కలెక్టర్ సందీప్ కుమార్ ఝా , అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అర్జీలు తీసుకుని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

**వృద్ధురాలి ఇబ్బందిపై కలెక్టర్ సత్వర స్పందన..**

నడవలేక ఇబ్బంది పడుతున్న ఓ వృద్ధురాలి సమస్యపై కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తక్షణం స్పందించారు. ఆమెకు వీల్ చైర్ అందజేసి, ఇబ్బందిని దూరం చేశారు. సిరిసిల్ల పట్టణానికి చెందిన మేరుగు విజయ చాలా రోజులుగా నడవలేక ఇబ్బంది పడుతున్నారు. సోమవారం జిల్లా సమీకృత కార్యాలయాల సము దాయంలోని ఆడిటోరి యంలో నిర్వహిం చిన ప్రజావాణికి వచ్చారు. తన దరఖాస్తును కలెక్టర్ సందీప్ కుమార్ ఝా కు అందజేయడంతో, వెంటనే స్పందించి వీల్ చైర్ ఇవ్వాలని జిల్లా సంక్షేమ శాఖ అధికారి లక్ష్మీరాజంను ఆదేశించగా, ఆయన విజయకు వీల్ చైర్ అందజేశారు. తన సమస్యను సత్వరమే పరిష్కరించి వీల్ చైర్ అందజేసిన కలెక్టర్ కు వృద్ధురాలు కృతజ్ఞతలు తెలిపారు. ఇంత త్వరగా సమస్య పరిష్కారం కావడంతో హర్షం వ్యక్తం చేశారు.



# అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందజేస్తాం..

## -ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్



**బలగం టీవీ, వేములవాడ**

అర్హులందరికీ రాష్ట్ర ప్రభుత్వ పథకాలు అందజేస్తామని ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆదే శ్రీనివాస్ అన్నారు . వేములవాడ అర్బన్ మండలం శభాష్ పల్లి గ్రామంలో తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం, ఇందిరమ్మ ఇళ్లు, నూతన రేషన్ కార్డులు పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్ హాజరై లబ్దిదారులకు అందజేశారు. అనంతరం ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్ మాట్లాడుతూ రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం, ఇందిరమ్మ ఇళ్లు, నూతన రేషన్ కార్డుల పంపిణీనీ గణతంత్ర దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిందన్నారు . ఇందిరమ్మ ఇల్లు ఇల్లు రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ అని స్పష్టం చేశారు. ఇంకా ఆయా గ్రామాల్లో పథకాలకు సంబంధించి దరఖాస్తు చేసుకోని వారు ఉంటే సంబంధిత కార్యాలయాల్లో అర్జీలు అందజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆడిట్ ఆఫీసర్ శ్రీనివాస్, వేములవాడ ఎంపీడీవో మల్లోత్రా తదితరులు పాల్గొన్నారు.

# బుమ్రాకు ఐసీసీ టెస్టు క్రికెటర్ ఆఫ్ ద ఇయర్

## తొలి భారత పేసర్‌గా రికార్డ్

**బలగం టీవి, హైదరాబాద్**

ఐసీసీ టెస్టు క్రికెటర్ ఆఫ్ ద ఇయర్ అవార్డును భారత బౌలర్ బుమ్రా గెలుచుకున్నాడు. ఈ మేరకు సోమవారం ఐసీసీ ఓ ప్రకటనను విడుదల చేసింది. 2024లో 13 టెస్టులు ఆడిన బుమ్రా.. 14.92 సగటుతో 71 వికెట్లను తీసుకున్నాడు. ఈ క్రమంలో టెస్ట్ క్రికెటర్ ఆఫ్ ది ఇయర్ అవార్డ్ అందుకున్న ఆరో భారత క్రికెటర్‌గా బుమ్రా నిలిచాడు. రాహుల్ ద్రవిడ్(2004), గౌతమ్ గంభీర్(2009), వీరేంద్ర సెహ్వాగ్(2010), రవిచంద్రన్ అశ్విన్(2016), విరాట్ కోహ్లీ(2018) బుమ్రా కంటే ముందే ఈ అవార్డ్ అందుకున్నారు. అయితే ఐసీసీ టెస్ట్ క్రికెటర్ ఆఫ్ ది ఇయర్‌గా నిలిచిన తొలి పేసర్‌గా జస్‌ప్రీత్ బుమ్రా చరిత్రకెక్కాడు.



గతేడాది టెస్ట్‌ల్లో బుమ్రా అసాధారణ ప్రదర్శన కనబర్చాడు. 13 టెస్ట్‌ల్లో 71 వికెట్లు పడగొట్టాడు. గతేడాది అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా రికార్డ్ సృష్టించాడు. బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలోనే బుమ్రా 32 వికెట్లు పడగొట్టాడు. బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ చివరి టెస్ట్‌లో వెన్ను గాయానికి గురైన బుమ్రా.. ప్రస్తుతం రెస్ట్ తీసుకుంటున్నాడు. అతని గాయాన్ని బీసీసీఐ మెడికల్ టీమ్ పర్యవేక్షిస్తోంది. ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ 2025కి ఎంపిక చేసిన భారత జట్టులో బుమ్రాకు చోటు దక్కింది. కానీ అతని ఫిట్‌నెస్ అప్‌డేట్‌పై అతను ఆడేది ఆధారపడి ఉంది.



# భారత్ జైత్రయాత్ర..

## మహిళల అండర్-19 ప్రపంచకప్‌లో వరుసగా 4వ విజయం

**బలగం టీవి, కౌలలంపూర్**

మహిళల అండర్-19 ప్రపంచకప్‌లో భారత్ జైత్రయాత్ర కొనసాగుతోంది. తాజాగా టీమ్‌ఇండియాకు టోర్నీలో వరుసగా నాలుగో విజయం సాధించింది. డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలోకి దిగిన భారత్.. సూపర్ సిక్స్‌లో భాగంగా ఆడిన తొలి మ్యాచ్‌లో బంగ్లాపై 8 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది.

మలేషియాలోని కౌలాలంపూర్ వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన భారత్.. తొలుత బౌలింగ్ ఎంచుకుంది. అనంతరం భారత బౌలర్లు సత్తాచాటారు. బంగ్లాదేశ్ టాప్ ఆర్డర్‌ను కకావికలం చేశారు. దీంతో బంగ్లాదేశ్ స్వల్ప వ్యవధిలో వికెట్లను కోల్పోయింది. ఓ దశలో బంగ్లాదేశ్.. 22 పరుగులకే 5 వికెట్లు కోల్పోయింది. లెఫ్టార్మ్ స్పిన్నర్ వైష్ణవి శర్మ (3/15) స్పిన్ మాయాజాలంతో మిడిలార్డర్ పనిపట్టగా సీమర్లు జోషిత (1/6), షబ్నమ్ షకిల్ (1/7) రాణించడంతో మొదట బ్యాటింగ్ చేసిన బంగ్లా.. 20 ఓవర్లకు 8 వికెట్ల నష్టానికి 64 పరుగులు చేసింది. కెప్టెన్ సమైయ అక్తర్ (21), జన్నతుల్ (14) మాత్రమే రెండంకెల స్కోరు సాధించారు.

ఛేదనను భారత్ 7.1 ఓవర్లలో రెండు వికెట్లు మాత్రమే కోల్పోయి పూర్తిచేసింది. తెలంగాణ అమ్మాయి గొంగడి త్రిష బ్యాటింగ్ (31 బంతుల్లో 40, 8 ఫోర్లు)తో పాటు బంతి (1/6)తోనూ మెరిసి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించింది. వైష్ణవికి 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు లభించింది. కాగా ఈ టోర్నీలో భారత్‌తో తలపడిన ఒక్క జట్టు కూడా మూడంకెల స్కోరు కూడా చేయలేకపోవడం విశేషం. వెస్టిండీస్ (44), మలేషియా (31), శ్రీలంక (58)తో పాటు తాజాగా బంగ్లాదేశ్ (64) కూడా 70 పరుగుల లోపే తోకముడిచాయి.



## స్మృతి మంధానాకు ఐసీసీ వన్డే మహిళా క్రికెటర్ ఆఫ్ ద ఇయర్ అవార్డు

**బలగం టీవి, హైదరాబాద్**

భారత మహిళా క్రికెటర్ స్మృతి మంధాన 2024 ఐసీసీ వన్డే క్రికెటర్ ఆఫ్ ది ఇయర్‌గా నిలిచింది. గతేడాది వన్డేల్లో స్మృతి మంధాన అత్యుత్తమ ప్రదర్శన కనబర్చడంతో ఐసీసీ.. ఆమెను మేటి వన్డే ప్లేయర్‌గా ఎంపిక చేసింది. స్మృతి మంధాన గత ఏడాది వన్డే క్రికెట్‌లో స్మృతి అద్భుతమైన ప్రదర్శన ఇచ్చింది. యిశీవలం 13 వన్డేల్లో 747 రన్స్ చేసింది. జూన్‌లో దక్షిణాఫ్రికాతో జరిగిన సిరీస్‌లో ఇండియా 3-0 తేడాతో గెలవడంలో స్మృతి కీలకంగా నిలిచింది. అక్టోబర్‌లో న్యూజిలాండ్‌తో జరిగిన సిరీస్‌లో.. తుది వన్డేల్లో సెంచరీతో చెలరేగింది. డిసెంబర్‌లో ఆస్ట్రేలియాతో పెర్త్‌లో జరిగిన మ్యాచ్‌లో సెంచరీ చేసి తన సత్తా చాటిందామె.

మంధానా 57.86 సగటుతో బ్యాటింగ్ చేసింది. ఆమె స్ట్రయిక్ రేట్ 95.15గా ఉంది. దూకుడు ఆటతీరుతో ఇండియన్ టాప్ ఆర్డర్ బ్యాటర్లలో ఆమె ప్రత్యేక స్థానాన్ని ఏర్పర్చుకున్నది. గత ఏడాది స్మృతి మందానా.. నాలుగు వన్డే సెంచరీలు నమోదు చేసింది. మహిళల క్రికెట్‌లో ఇదో కొత్త రికార్డు. 2004లో వన్డేల్లో వందకుపైగా బౌండరీలను బాదింది. వీటిల్లో 95 ఫోర్లు, ఆరు సిక్సర్లు ఉన్నాయి.2024లో ఆమె 13 మ్యాచుల్లో 747 రన్స్ చేసింది. దీంతో మహిళల వన్డేల్లో మంధా.. లీడింగ్ రన్ స్కోరర్‌గా నిలిచింది. మహిళల వన్డే క్రికెట్‌లో అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్ల జాబితాలో మంధాన తర్వాత లౌరా వోల్వార్డ్(697), టామీ బ్యూమోంట్(554), హీలీ మాథ్యూస్(469) ఉన్నారు.




## అజ్మతుల్లా ఓమర్‌జాయ్‌కు ఐసీసీ వన్డే క్రికెటర్ ఆఫ్ ది ఇయర్ అవార్డు

**బలగం టీవి, హైదరాబాద్**

ఆఫ్ఘనిస్థాన్ ఆల్‌రౌండర్ అజ్మతుల్లా ఓమర్‌జాయ్ ఐసీసీ వన్డే క్రికెటర్ ఆఫ్ ది ఇయర్ అవార్డును గెలుచుకున్నాడు. ఈ మేరకు ఐసీసీ ఒక ప్రకటన విడుదల చేసింది. 2024లో తన పేస్ బౌలింగ్‌తో పాటు శక్తివంతమైన బ్యాటింగ్‌తో అజ్మతుల్లా అత్యుత్తమ ఆటగాడిగా నిలిచాడు. 24 ఏళ్ల వయసులో అజ్మతుల్లా తన వన్డే కెరీర్‌ను అసాధారణంగా తీర్చిదిద్దుకుని, వన్డే క్రికెట్‌లో అత్యంత ప్రభావవంతమైన ఆటగాడిగా మారాడు. ఆఫ్ఘనిస్థాన్ జట్టులో అతను అత్యధిక పరుగులు చేసిన రెండో బ్యాటర్‌గా నిలిచాడు. 2024లో అతను 14 వన్డేలు ఆడాడు. మొత్తం 417 పరుగులు చేసి జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషించాడు. బౌలింగ్‌లో కూడా అజ్మతుల్లా 17 వికెట్లు తీసుకున్నాడు. బ్యాటింగ్‌లో 52.12 సగటుతో అతను స్కోరింగ్ చేశాడు. బౌలింగ్‌లో 20.47 యావరేజ్‌తో వికెట్లు తీసుకున్నాడు.

## 'హరి హర వీరమల్లు' కొత్త పోస్టర్ రిలీజ్

**బలగం టీవి, హైదరాబాద్**




ఏపీ డిప్యూటీ సీఎం, పవర్ స్టార్ పవన్‌కల్యాణ్ హీరోగా తెరకెక్కుతున్న సినిమా 'హరి హరి వీరమల్లు'. దర్శకులు క్రిష్, జ్యోతికృష్ణ సంయుక్తంగా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. బాలీవుడ్ స్టార్ నటుడు బాబీ డిఓల్ ఈ చిత్రంలో కీలక పాత్ర పోషిస్తున్నారు. సోమవారం బాబీ పుట్టినరోజు సందర్భంగా మేకర్స్ ఆయన పోస్టర్ రిలీజ్ చేశారు. పవన్ సరసన నిధి అగర్వాల్ నటిస్తుండగా ఎం.ఎం.కీరవాణి ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. మెగా సూర్య ప్రొడక్షన్స్ పతాకంపై ఏ.ఎం.రత్నం సమర్పణలో ఎ.దయాకర్ రావు నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. రెండు పార్టులుగా విడుదల కానున్న ఈ సినిమా తొలి భాగమైన 'హరిహర వీరమల్లు పార్ట్ 1: స్వోర్డ్ వర్సెస్ స్పిరిట్' 2025 మార్చి 28న సినిమా థియేటర్లలో ప్రేక్షకుల ముందుకు రానుంది.




## 'కన్నప్ప' నుంచి ఫిబ్రవరి 3న ప్రభాస్ ఫస్ట్ లుక్

**బలగం టీవి, హైదరాబాద్**

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ కీలక పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం కన్నప్ప. మంచు కుటుంబం నుంచి వస్తున్న ఈ మోస్ట్ ప్రెస్టీజియస్ ప్రాజెక్ట్‌లో మంచు విష్ణు కథానాయకుడిగా నటిస్తుండగా.. దాదాపు రూ.100 కోట్ల బడ్జెట్‌తో వస్తున్న ఈ సినిమాను కలెక్షన్ కింగ్ మంచు మోహన్ బాబు నిర్మిస్తున్నాడు. ఏప్రిల్ 25న వరల్డ్ వైడ్‌గా ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నారు మేకర్స్. అయితే ఈ మూవీ నుంచి ప్రభాస్ ఫస్ట్ లుక్‌ని ఫిబ్రవరి 3న విడుదల చేయనున్నట్లు సినిమా యూనిట్ తెలిపింది. ఈ సందర్భంగా కొత్త పోస్టర్‌ను పంచుకుంది.



## పాకిస్థాన్‌పై వెస్టిండీస్ విజయం..

- సిరీస్ సమం

**బలగం టీవి, ముల్తాన్**

పాకిస్తాన్‌తో జరిగిన రెండో టెస్టులో 120 రన్స్ తేడాతో వెస్టిండీస్ విజయం సాధించింది.దాంతో రెండు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్‌ను 1-1తో సమం చేసుకుంది. ఈ విజయం విండీస్ క్రికెట్ చరిత్రలో చారిత్రక విజయం. 21వ శతాబ్దంలో పాక్ గడ్డపై ఆ జట్టుకు ఇది తొలి టెస్ట్ విజయం. విండీస్ చివరిసారి 1990లో పాకిస్తాన్ గడ్డపై టెస్ట్ విజయం సాధించింది. మళ్లీ 35 ఏళ్ల తర్వాత విండీస్ పాక్‌ను వారి సొంతగడ్డపై మట్టికరిపించింది.

ముల్తాన్ వేదికగా జరిగిన మ్యాచ్‌లో 255 పరుగుల లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన పాకిస్తాన్ 133 పరుగులకే ఆలౌటై ఘోర పరాభవాన్ని మూటగట్టుకుంది. స్పిన్నర్లు గోమెల్ వార్రికన్ (5/27), కెవిన్ సింక్లెయిర్ (3/61), గుడకేశ్ మోటీ (2/35) పాకిస్తాన్ పతనాన్ని శాసించారు. పాక్ సెకెండ్ ఇన్నింగ్స్‌లో బాబర్ ఆజమ్ చేసిన 31 పరుగులే అత్యధికం కాగా.. మొహమ్మద్ రిజ్వాన్ (25), కమ్రాన్ గులామ్ (19), సౌద్ షకీల్ (13), సల్మాన్ అఘా (15) రెండంకెల స్కోర్లు చేశారు. మూడో రోజు ఆట ప్రారంభమైన కొద్ది నిమిషాల్లోనే మ్యాచ్ ముగిసింది. రెండో రోజు ఆట ముగిసే సమయానికి పాక్ స్కోర్ 4 వికెట్ల నష్టానికి 76 పరుగులుగా ఉండింది. మూడో రోజు ఆట తొలి సెషన్‌లోనే పాక్ మిగిలిన 6 వికెట్లు కోల్పోయింది. విండీస్ స్పిన్నర్లు పాక్ బ్యాటర్లను ఉక్కిరిబిక్కిరి చేశారు. అంతకుముందు విండీస్ రెండో ఇన్నింగ్స్‌లో 244 పరుగులకు ఆలౌటైంది. బ్రాత్‌వైట్ (52) అర్ధ సెంచరీతో రాణించాడు. అమీర్ జాంగూ (30) ఓ మోస్తరు స్కోర్ చేయగా.. చివరి వరుస బ్యాటర్లు టెవిన్ ఇమ్లాచ్ (35), కెవిన్ సింక్లెయిర్ (28), గుడకేశ్ మోటీ (18), గోమెల్ వార్రికన్ (18) రెండంకెల స్కోర్లు చేశారు. పాక్ బౌలర్లలో సాజిద్ ఖాన్, నౌమన్ అలీ తలో నాలుగు వికెట్లు పడగొట్టగా.. కషిఫ్ అలీ, అబ్రార్ అహ్మద్ చెరో వికెట్ దక్కించుకున్నారు.

తొలి రోజు ఆటలో తొలుత బ్యాటింగ్ చేసిన విండీస్ 163 పరుగులకే ఆలౌట్ కాగా.. పాకిస్తాన్ 154 పరుగులకే కుప్పకూలిన సంగతి తెలిసిందే. రెండు టెస్ట్ మ్యాచ్‌ల్లో కలిపి 19 వికెట్లు పడగొట్టిన విండీస స్పిన్నర్ జోమెల్ వార్రికన్‌కు ప్లేయర్ ఆఫ్ ద సిరీస్ అవార్డు లభించింది. రెండో టెస్ట్‌లో మ్యాచ్ విన్నింగ్ ప్రదర్శన చేసినందుకు గానూ వార్రికన్‌కు ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు కూడా దక్కింది.